పరిష్కారం వైపు అడుగులు పడేనా..?

- జిల్లాను వేధిస్తున్న అనేక సమస్యలు - నేడు జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం
- హాజరుకానున్న జిల్లా ఇంఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో ఏళ్ల కాలంగా సమస్యలు తిష్ట వేశాయి. దీంతో జిల్లా వాసులకు అనేక తిప్పలు తప్పడం లేదు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా ఇంఛార్జి మంత్రి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారం వైపు అడుగుల పడేనా అని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు...

తప్పని వలస వెతలు : ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలస వెతలు తప్పడం లేదు. ఉన్న ఊర్లో ఉపాధి లేకపోవడంతో పొట్ట చేతపట్టుకుని ఇతర పట్టణాలకు, నగరాలకు తరలిపోతున్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, హొళగుంద, ఆలూరు, కోడుమూరు మండలాల నుంచి ఈ ఏడాది కూడా వలసలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ, బెంగళూరు, గుంటూరు, ముంబైలకు తరలివెళ్లారు. కోసిగి మండలంలో అత్యధికంగా 6 వేల కుటుంబాలు వలస బాట పట్టాయి. ఉపాధి పనుల్లో సరైన కూలి దక్కకపోవడంతోనే వలస వెళ్తున్నట్లు వలసదారులు చెబుతున్నారు.

ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు : కరవుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హొసళ్లి , సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008 లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి.

సమస్యలకు నిలయంగా జిల్లా కేంద్ర : జిల్లా కేంద్రం పలు సమస్యలకు నిలయంగా మారింది. శివారు కాలనీలకు తాగునీటి సమస్య పట్టిపీడిస్తోంది. కల్లూరుతో పాటు నూతనంగా నగర పాలక సంస్థ పరిధిలోకి వచ్చి చేరిన గ్రామాలలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో రెండు, మూడు రోజులకు ఒక సారి నీటిని వదులుతున్నారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. వర్షాలు వస్తే మురుగు నీరు నేలపై పారుతున్నాయి. నగర జనాభాకు అను గుణంగా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతోనే ఈ సమస్య నెలకొంది.

సాగు, తాగు నీటికి తిప్పలే : ఆలూరు నియోజకవర్గంలో రైతులు వర్షాధారంపై ఆధారపడి జీవిస్తారు. సాగు నీరు లేక పోవడం, సకాలంలో వర్షాలు లేక రైతులు, వ్యవసాయ కార్మికులు ఎక్కువగా సుదూర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. తాగు నీటి కోసం ఎల్ఎల్‌సి, హెచ్ఎల్‌సి నుండి ఎత్తిపోతల ద్వారా నియోజకవర్గ ప్రజలకు తాగునీరు అందుతుంది. వర్షాకాలంలో వారానికి ఒకసారి, వేసవిలో 15 రోజుల నుండి 20 రోజులకు నీరు అందిస్తారు. నీటి సమస్య పరిష్కారానికి వామపక్షాల పోరాటంతో చిప్పగిరి మండలంలో 2008లో నగరడోన రిజర్వాయర్‌కు వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేసి వదిలేశారు. దానితో పాటు హాళహర్వి మండలంలోని వేదవతి రిజర్వాయర్ పూర్తి అయితే నియోజకవర్గంలో సాగు, తాగు నీటి సమస్య పరిష్కారం అవుతుంది.

ఉన్నత విద్యాసంస్థలకు నిధుల కొరత : కర్నూలు జిల్లా చుట్టూ అనేక విద్యా సంస్థలు ఉన్నప్పటికీ వాటి నిధుల కొరతతో అభివృద్ధి చెందడం లేదు. రాయలసీమ విశ్వ విద్యాలయంలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టి ఇక్కడ అనేక విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసి ఉన్నత విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. విశ్వవిద్యాలయ అభివృద్ధికి రూ.500 కోట్ల నిధులను కూడా కేటాయిస్తే మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని విద్యార్థులు కోరుతున్నారు.

9 ,10 తేదీల్లో యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

- ఏర్పాట్లను పరిశీలించిన నేతలు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఈనెల 9,10 తేదీల్లో గూడూరులో యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి పేర్కొన్నారు. ఆదివారం గూడూరు మండల కేంద్రంలో యుటిఎఫ్ జిల్లా మహాసభ ఏర్పాట్లను రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌పాటి, జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువ, జిల్లా కార్యదర్శి తిమ్మన్న, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాంతారావు షబ్బీర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తొమ్మిదో తేదీ గూడూరు మండల కేంద్రంలో వేలాదిమందితో ఉపాధ్యాయులతో ప్రదర్శన అనంతరం సభ ఉంటుందన్నారు. ఈ మహాసభలకు జిల్లా నుండి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు.

గూడూరును సందర్శించిన యుటిఎఫ్ నేతలు

ప్రజాసేవకు మించిన పరమావధి లేదు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజాసేవకు మించిన సేవ మరొకటి లేదని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము అన్నారు. డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కర్నూలు మండలం జి సింగవరం గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ కార్యదర్శి సురేష్ అధ్యక్షత వహించారు. ముందుగా జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర డివైఎఫ్ఐ జండాను ఆవిష్కరించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము మాట్లాడుతూ రక్తదానానికి మించిన దానం మరొకటి లేదన్నారు. రక్తం దానం చేయడం అంటే మరొకరి ప్రాణం కాపాడడమే అని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు యువత ముందుండాలన్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమం నిర్వహించిన గ్రామ కమిటీని అభినందించారు. నేడు దేశంలో పనిచేయడానికి ఉపాధి లేక, తినడానికి తిండి లేక అనేకమంది రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు. అలాంటి వారందరికీ డివైఎఫ్ఐ అండగా ఉంటుందన్నారు. ఇలాంటి రక్తదాన శిబిరాలు అనేకం నిర్వహిస్తామని చాలామంది రక్తం కోసం సంప్రదించిన వెంటనే వారికి రక్తం అందించి గొప్ప సేవ డివైఎఫ్ఐ చేస్తుందని అన్నారు. యువత అందరూ ఇలాంటి సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని ప్రజలకు సేవ చేయడానికి మించిన సేవ మరొకట్లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఉన్న పరిశ్రమలు అమ్మివేస్తూ మోసం చేయడమే కాకుండా అనేక దూరలవాట్లకు కారణమవుతున్నాయని అన్నారు. నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పడానికి యువత ఐక్యత కావాలని వారికి మద్దతుగా డివైఎఫ్ఐ అండగా ఉంటుందని తెలితెలిపారు. గ్రామ సర్పంచ్ నాగేంద్ర మాట్లాడుతూ డివైఎఫ్ఐ యువజన సంఘం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సిఐటియు మండల అధ్యక్షులు హుస్సేనయ్య, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు అబ్దుల్లా, మండల నాయకులు అంజి, దివాకర్, గ్రామ కార్యదర్శి సురేష్, నాయకులు పెద్దయ్య, శశి,వంశి, నరేష్, మల్లేష్,దస్తగిరి, బజారి, హరి రాజు రాకేష్ మధు రైతు సంఘం నాయకులు కాజా పాల్గొన్నారు రక్తదాన శిబిరంలో దాదాపు 40 మంది యువకులు రక్తదానం చేశారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము

విద్య ఉపాధికోసం పోరాటం : డివైఎఫ్ఐ కర్నూలు న్యూ సిటీ కమిటీ 34వ వార్డు కృష్ణారెడ్డి నగర్లో డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండావిష్కరణ చేశారు.సిటీ ఉపాధ్యక్షులు సాయి అధ్యక్షతన వహించారు. వార్డు కార్యదర్శి వీరేష్ జెండాను ఎగరవేశారు. అనంతరం డివైఎఫ్ఐ న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్‌బాష , జిల్లా మాజీ నాయకులు వెంకటేష్ మాట్లాడారు. వార్డు నాయకులు గణేష్ , అభిషేక్, చంద్రశేఖర్, పవన్ , వినయ్ , శివ తదితరులు పాల్గొన్నారు.

ఈ నామ్ సమస్య వల్లే ఇబ్బందులు

- సామర్థ్యానికి మించి మార్కెట్‌కు ఉల్లి
- త్వరలో కోల్డ్ స్టోరేజీ పూర్తి
- ప్రజాశక్తితో కర్నూలు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి జయలక్ష్మి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

'కర్నూలు జిల్లాలో రైతులు పండించిన పంటలు క్రయవిక్రయాలు జరుపుతున్న పేరుగాంచిన మార్కెట్ కర్నూలు వ్యవసాయ మార్కెట్. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 మార్కెట్లు ఉన్నాయి. అందులో కర్నూలు జిల్లాలో 7, నంద్యాల జిల్లాలో 8 ఉన్నాయి. వాటిలో దాదాపు 13 రకాల పంట ఉత్పత్తులు రైతులు అమ్ముకునే ఏకైక మార్కెట్ కర్నూలు మాత్రమే. ఈ సారి మార్కెట్ సామర్థ్యానికి మించి మార్కెట్‌కు ఉల్లి దిగుబడులు వచ్చాయి. ఈ నామ్‌లో సాంకేతిక సమస్య వల్ల ఆఫ్‌లైన్ టెండర్లు నిర్వహించడంతో కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తాయి.' అని కర్నూలు వ్యవసాయ మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి ఆర్.జయలక్ష్మి తెలిపారు. త్వరలో కోల్డ్ స్టోరేజీ పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ప్రజాశక్తితో ఆమె ముఖాముఖిగా మాట్లాడారు...

మార్కెట్‌లో ఏయే రకాల పంట ఉత్పత్తులు క్రయవిక్రయాలు జరుగుతాయి?

కార్యదర్శి : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో దాదాపు 13 రకాల పంట ఉత్పత్తులు క్రయవిక్రయాలు జరుగుతాయి. ఉల్లి, వాము, వేరుశనగ, శనగ, కందులు, మొక్కజొన్న, సోయాబీన్, కొర్రలు, మినుములు, ఎండుమిరప, ఆముదం, పొద్దుతిరుగుడు, సజ్జ ఇలా చాలా రకాల పంటలు ఉన్నాయి.

ఈ నామ్ ఎప్పుడు ప్రారంభించారు. దాని వల్ల రైతులకు ఉపయోగం ఎలా ఉంది?

కార్యదర్శి : 2016లో రాష్టంలోనే మొదటి సారి కర్నూలు మార్కెట్‌లో ఈ నామ్‌ను ప్రారంభించాం. దీనివల్ల వ్యాపారులు ఎక్కడ నుండి అయిన టెండర్‌లో పాల్గొనే అవకాశం ఉంటుంది. వ్యాపారులు సిండికేట్ అనేది జరగదు. రైతులకు మంచి పోటీ ధర లభిస్తుంది. రైతులు పండించిన పంటలకు సరైన ధర పొందే వెసులుబాటు ఉంటుంది. ప్రతి పంట ఈ నామ్‌లో జరుగుతున్న ఏకైక మార్కెట్ కర్నూలు మాత్రమే.

ఇక్కడ వ్యాపారులు, కమిషనర్ దారులు, హమాలీలు ఎంత మంది ఉన్నారు?

కార్యదర్శి : ఇక్కడ దాదాపు 150 మంది దాకా వ్యాపారులు ఉన్నారు. 200 మందికి పైగా కమిషన్‌దారులు, వెయ్యి మందికి పైగా హమాలీలు ఉన్నారు. ఇందులో మహిళ హమాలీలు కూడా ఉన్నారు. లోడింగ్, అన్ లోడింగ్, కోత, చాట, పట్టుబడి ఇలా చాలా రకాలుగా హమాలీలు ఉన్నారు.

ఎక్కువగా విక్రయాలు జరిగే పంటలు ఏమున్నాయి?

కార్యదర్శి : ప్రధానంగా వేరుశనగ, మొక్కజొన్న, ఉల్లి పంటల క్రయ విక్రయాలు జరుగుతాయి. ఈ ఏడాది 35 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉల్లి దిగుబడులు వచ్చాయి. మిగతా పంట ఉత్పత్తులు నిలిపి ఒక్క ఉల్లి పంటలు తెప్పించాం. మార్కెట్ సామర్థ్యం 10 వేల క్వింటాలు అయితే దాదాపు 20 వేల క్వింటాళ్ల ఉల్లి మార్కెట్‌కు వచ్చింది. హైదరాబాద్, తాడేపల్లి గూడెంలో లభిస్తున్న ధర కర్నూలులో లభించడం వల్ల కర్నూలు నుండే కాకుండా తెలంగాణ నుండి కూడా ఉల్లి దిగుబడులు వచ్చాయి.

రైతులకు ఎలాంటి సౌకర్యాలు అందిస్తున్నారు?

కార్యదర్శి : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో పంటలు అమ్ముకునే రైతులకు రూ.15 భోజనాన్ని అందిస్తున్నాం. మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీలు, కార్మికులు, మార్కెట్‌కు పంట తెస్తున్న రైతు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.రెండు లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లిస్తాం. రాత్రిళ్ళు పడుకోవడానికి విశ్రాంతి భవనం ఉంది. కొన్ని మరమ్మతులు మొదలు పెట్టాం. శుభ్రంగా చేసి రైతులు ఉండటానికి ఏర్పాటు చేస్తాం.

రైతులు పంటలు నిల్వ చేసే కోల్డ్ స్టోరేజ్ ఎప్పటికి పూర్తి అవుతుంది?

కార్యదర్శి : రాష్ట్రంలో 2017లో టిడిపి ప్రభుత్వ హయాంలో 4 వేల మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్‌లు ఐదు దాకా మంజూరు అయ్యాయి. అందులో కర్నూలుకు ఒకటి ఇచ్చారు. ఈ ప్రభుత్వంలో పూర్తి చేయడానికి మంత్రి, ఎంపీ సానుకూలంగా స్పందించారు. త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుని రైతులకు పంటలు నిల్వ చేసుకునేలా చూస్తాం.

ఉల్లి క్రయవిక్రయాల్లో అవకతవకలు జరిగాయని, రైతులకు నష్టం జరిగిందని విమర్శలున్నాయి?.

కార్యదర్శి : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో ఎక్కడా అవకతవకలు జరగడం లేదు. ఈ ఏడాది ఉల్లికి కర్నూలులో మంచి ధర లభించింది. దిగుబడులు కూడా ఎక్కువగా వచ్చాయి. అందులోనూ ఆన్‌లైన్ సర్వర్ సమస్య వల్ల ఈ నామ్ టెండర్ పని చేయలేదు. ఆఫ్‌లైన్‌లో టెండర్ ఆలస్యం అవడం సమస్యగా మారింది. అంతేకాని ఇక్కడ ఎలాంటి మోసాలు, అవకతవకలు, సిండికేట్‌లు జరగలేదు. అవన్నీ అపోహలు మాత్రమే. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్,మార్కెట్ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అలాంటి పనులకు ఆస్కారం లేదు.

మార్కెట్‌లో వ్యాపారుల సిండికేట్ అయ్యి రైతులకు ధర లేకుండా చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. మీరేమంటారు?

కార్యదర్శి : అలాంటి సిండికేట్ వ్యాపారాలు లేవు. ఉంటే మా దృష్టికి తీసుకువస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గత రెండు రోజులుగా తాడేపల్లి గూడెం కంటే కర్నూలు మార్కెట్‌లోనే అత్యధిక ధర రైతులకు లభిస్తుంది. తూకాల్లో కానీ, తక్ పట్టిలో కానీ సరుకును తీసుకురావడం లేదా ఇక్కడ ఏదైనా సమస్య అయినా ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

మాట్లాడుతున్న డిఇఒ శామ్యూల్‌పాల్

మన జీవనం ఇతరులకు ఆదర్శం కావాలి

డిఇఒ శామ్యూల్‌పాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : మన జీవనం ఇతరులకు ఆదర్శప్రాయం కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్‌పాల్ పేర్కొన్నారు. నందికొట్కూరు రోడ్డులోని అభయగిరిలో హెచ్ఐవి సోకిన పిల్లలకు లిటిల్‌ఫ్లాక్‌ట్రస్ట్ అధినేత జిబి.ప్రవీణ్ కుమార్, శంబు నీలిమ, హార్వర్డ్ ఇంటర్ నేషనల్ మెడివర్సిటీ వెల్ నెస్ హోమియో క్లినిక్స్ సిఇఒ, చైర్మన్ డాక్టర్ అరుణ్‌కుందవరం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి శామ్యూల్ పాల్, అల్‌ఫ్రెడ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మల్లెల అల్‌ఫ్రెడ్ రాజు, మనతెలుగు దినపత్రిక ఎడిటర్ చిన్న రామాంజనేయులు హాజరయ్యారు. ముందుగా పిల్లలకు పౌష్టికాహారం అందచేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ మన జీవనం ప్రతి ఒక్కరికి ఆదర్శం కావాలన్నారు. డాక్టర్ అరుణ్ కుందవరం, జిబి.ప్రవీణ్ కుమార్ పిల్లలను దత్తత తీసుకుని, వారికి జీవనం ఉన్నంత వరకు వైద్య చికిత్సతోపాటు, విద్యాభోధన అందించడం అభినందనీయం అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చరిత్రలో నిలిచిపోతాయని కొనియాడారు. భవిష్యత్తులో తాము సైతం పిల్లల అభివృద్ధికి సహాయసహకారాలు తప్పకుండా అందిస్తానని తెలిపారు. డాక్టర్ అరుణ్ కుందవరం మాట్లాడుతూ ప్రతి మనిషిలో లోపాలను బట్టి తమ ఆలోచన స్థాయిని దిగజార్చుకోకూడదని అన్నారు. క్రమశిక్షణ ద్వారా లోపాలు సరిదిద్దవచ్చు అని అన్నారు. విద్యార్థుల అభివృద్ధికి తమవంతుగా అండగా నిలవడానికి కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు. మల్లెల అల్ ఫ్రెడ్ రాజు మాట్లాడుతూ ప్రవీణ్ కుమార్ దంపతులు ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు జరుపుతున్నట్లు చెప్పారు. నేడు ఇలాంటి కార్యక్రమం రూపొందించడం గర్వకారణమన్నారు. డాక్టర్ అరుణ్ కుందవరం సహకారం ఎనలేనిదని చెప్పారు. వారు చేస్తున్న కార్యక్రమాలకు తమ సహకారం ఎల్లవేళల ఉంటుందన్నారు. సిస్టర్స్ శిల్ప, దీప్తి, లిటిల్ ఫ్లాక్ ట్రస్ట్ టీం సభ్యులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గుంతల రహిత రహదారులుగా రోడ్లు

మాజీ జడ్‌పి చైర్మన్ బత్తిన వెంకటరాముడు

ప్రజాశక్తి-తుగ్గలి : రాష్ట్రంలోని రహదారులన్నీ గుంతల రహిత రహదారులుగా మారుతున్నాయని, అందుకు రాష్ట్రప్రభుత్వం రూ.850 కోట్లు నిధులు విడుదల చేసిందని మాజీ జడ్‌పి చైర్మన్ బత్తిన వెంకట రాముడు, మాజీ జడ్‌పిటిసి సాంబశివారెడ్డి అన్నారు. ఆదివారం ఎద్దులదొడ్డిలో పత్తికొండ–ప్యాపిలి, తుగ్గలి–గుత్తి బిటి రోడ్లు కు మరమ్మతు పనులు చేసేందుకు వారు భూమి పూజలు చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రహదారులు అన్ని గుంతల రహిత రహ దారులుగా ఉండేందుకు వాటికి మరమ్మతులు చేసేందుకు టిడిపి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ సహకారంతో పత్తికొండ– ప్యాపిలి, తుగ్గలి– గుత్తి తారు రోడ్లకు మరమ్మతుల పనులు చేసేందుకు రూ.11 లక్షల నిధులు మంజూరు చేయించారన్నారు. ఈ పనులను కాంట్రాక్టర్ సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాలలో కూడా సిమెంట్ రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఆర్ అండ్ బి డిఇఇ శివ రుద్ర కుమార్, ఎఇఇ శ్వేత, కాంట్రాక్టర్ చెన్నంపల్లి సంజీవ చౌదరి, సర్పంచి రాముల విజయ్, టిడిపి నాయకుడు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ సాంకేతికత పాట్లు

-ఇసుక ట్రక్కుదారుల బారులు -సకాలంలో ఇసుక అందక డ్రైవర్ల పడిగాపులు

ప్రజాశక్తి- సి బెళగల్

ఇసుక లేనిదే ఏ ఇళ్ళు గాని, భవనం గాని చివరికి మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్నా ఇసుక అవసరం అంతా ఇంత కాదు. ఇసుక లేక 42 రంగాలు కుంటు పడినట్లే.. ఇసుక కోసం ఆన్‌లైన్ చేయాలి. అప్పుడే తగు వేళకు ఇసుక తీసుకెళ్లాలి. ఆన్‌లైన్ కష్టాలు ఎదురయి పాట్లు తప్పడం లేదు. సి బెళగల్ మండలం కొత్తకోట, ఈర్లదీన్నే, ముడుమాల, సింగవరం, పలదొడ్డి గ్రామాల్లో ప్రభుత్వం ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసింది. ఈర్లదీన్నే, సింగవరం, కొత్తకోట వద్ద మాత్రమే ఇసుక దొరుకుతుంది. కానీ ఈ మధ్య ఇసుక అవసరం ఉన్న వాహన దారులు, కార్మికులు ఆన్‌లైన్ చేసుకునేందుకు అక్కడకు ఎగబాకుతున్నారు. సర్వర్ సాంకేతిక లోపం కారణంగా అటు ట్రక్కు వాహన దారులు ఇటు మైనింగ్ అధికారులు పాట్లు పడుతున్నారు. రోజుకు 10 నుండి 20 ట్రక్కులకు మాత్రమే సర్వర్ సహకరిస్తుంది. ఆశించి సూదుర ప్రాంతాల నుండి కూడా ఇక్కడికి వస్తున్న ట్రక్కులు ఇసుక అవసరం తీరక రీచ్ దగ్గర నుండి కనుచూపు మేర బారులుగా నిలుపుకున్నారు. మండల కేంద్రానికి ఆ రీచ్‌లు మారుమూల గ్రామాలు కావడంతో అక్కడ వచ్చిన డ్రైవర్లకు, క్లినర్లకు ఆహారం దొరక్క, చివరికి నీళ్ల దొరక్క నదిలో నీటితోనే సేద తీర్చుకొని ఇసుక కోసం పడిగాపులు కాస్తూన్నారు. ఉన్నతాధికారులు సర్వర్ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

నిబద్ధతకు పదోన్నతుల ప్రోత్సాహం

మేయర్ , కమిషనర్

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

నిబద్ధతతో పనిచేసే ఉద్యోగులకు పదోన్నతులు అనేవి ప్రోత్సాహం లాంటివని నగరపాలక సంస్థ మేయర్‌బివై.రామయ్య, కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అన్నారు. సీనియర్ అసిస్టెంట్ల నుండి సూపరింటెండెంట్లుగా పదోన్నతులు పొందిన కె.రామకృష్ణ, టి.అబ్దుల్ వాజీద్‌లకు మేయర్, కమిషనర్ నియామక ఉత్తర్వులను అందజేశారు. వారిని అభినందించిన అనంతరం మేయర్, కమిషనర్ మాట్లాడుతూ పదోన్నతి పొందడం అంటే బాధ్యత పెరగడమని, నగరపాలక సంస్థ కోసం మరింత శ్రమపడి, తమతో పాటు సంస్థకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేనేజర్ ఎన్.చిన్నరాముడు, సూపరింటెండెంట్ సుబ్బన్న, సిసి.రవి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాయిని సీతాఫలం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రకృతి ప్రసాదించిన పండ్లు ఎన్నో మనకు ఆయా సీజన్లలో లభిస్తాయి. ఏ సీజన్లో వచ్చిన పండ్లను ఆ సీజన్లలో మానవుడు తప్పనిసరిగా తినాలి. అలా తిన్నప్పుడు మానవుని శరీరంలోని అవయవాలు సక్రమంగా పనిచేసి ఆరోగ్యంగా ఉండేందుకు ఉపయోగపడతాయి. మానవుడు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాటిని సహజ సిద్ధంగా మాగకముందే వాటిని తెంచి, త్వరగా మాగే విధంగా చేసేందుకు కొన్ని రసాయనాలు నీటిలో కలిపి అందులో ముంచి, లేదా పండ్ల మధ్యలో ఉంచి కృత్రిమంగా మాగే విధంగా చేస్తున్నారు. అలాంటివి తినడం వల్ల మానవుని శరీరానికి మేలు చేయకపోగా హాని కలిగిస్తూ జబ్బుల బారిన పడవచ్చు. సహజ సిద్ధంగా లభించిన పండ్లను మాత్రమే తిని ఆరోగ్యంగా ఉండాలని సూచన. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు మానవుడు బతికినంత కాలం ఆరోగ్యంగా ఉండే విధంగా చూసుకోవాలి. అందుకే ఆరోగ్యాన్ని మించిన సంపద లేదని చెబుతారు.

ప్రతి ఏడాది మనకు శీతాకాలం ప్రారంభం నుంచే సీతాఫలాలు లభిస్తాయి. అందులో భాగంగా ఇప్పుడు నగరంలో ఎక్కడ చూసినా సీతాఫలాలు కనువిందు చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ పండ్లు మనం చూస్తుంటాం. ఇవి సీజన్‌లో మాత్రమే లభిస్తాయి. కనుక ఎవరైనా సరే ఈ పండ్లను మిస్ అవ్వకుండా తినాల్సిందే. వీటిని తినడం వల్ల మనకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

సీతాఫలాలు తినడం వల్ల ప్రయోజనాలు: ఈ పండ్లలో అనేక పోషకాలు ఉంటాయి. ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇవి జీర్ణ క్రియను మెరుగుపరుస్తాయి. మలబద్ధకం తగ్గిస్తుంది. మలబద్ధకం ఉన్నవారికి సీతాఫలాలు చక్కటి ఔషధంగా పనిచేస్తాయి. రోజుకు ఒక పండు తింటే సుఖ వీరేచనం అవుతుంది. సీతాఫలాల్లో పొటాషియం మెగ్నీషియం సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తనాళాలను వెడల్పు చేస్తాయి. దీనితో రక్త సరఫరా సాఫీగా జరుగుతుంది. దీనివల్ల బిపి నియంత్రణలోకి వస్తుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకుంటుంది. మధుమేహం ఉన్నవారు మాత్రం డాక్టర్ సలహా మేరకు ఈ పండ్లను తక్కువగాతినాల్సి ఉంటుంది. వీటిలో చక్కెరస్థాయి ఎక్కువగా ఉంటాయి. కనుక షుగర్ ఉన్నవారు అధికంగా ఈ పండ్లను తింటే షుగర్ పెరుగుతుంది.

సీతాఫలాలు తినడం వల్ల లాభాలు: వీటిని రోజువారి ఆహారంలో భాగంగా చేసుకోవాలి. ఇవి రోగాలను దరి చేరనివ్వవు. ఈ పండ్లను తినడం వల్ల గ్యాస్, ఆసిడిటీ కడుపు ఉబ్బరం సమస్య నుండి బయటపడవచ్చు. తిన్న ఆహారం జీర్ణం అవుతుంది. పేగుల్లో ఉండే వ్యర్థాలు సులభంగా బయటికి వెళ్లిపోతాయి. శరీరం అంతర్గతంగా క్లీన్ అవుతుంది. సీతాఫలాల్లో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా ఫ్లేవనాయిడ్స్ విటమిన్ .సి , ఫినోలిక్ సమ్మేళనాలు కారేనాయక్ యాసిడ్ ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ ను నిర్మూలిస్తాయి. దీనితో గుండె జబ్బులు క్యాన్సర్ రాకుండా ఉంటాయి. ఇక ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కళ్ళను సంరక్షిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి జరగకుండా చూస్తాయి. దీనితో వయసు మీద పడిన తర్వాత కళ్ళలో శుక్లాలు ఏర్పడకుండా చేస్తాయి. ఆందోళన ఒత్తిడి నుండి బయటపడేలా చేస్తుంది. సీతాఫలం పండ్లను తినడం వల్ల విటమిన్ -ఏ లభిస్తుంది. ఇది కంటి చూపును పెంచుతుంది. ఈ పండ్లలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇవి శరీరంలోని నొప్పులు వాపులు తగ్గిస్తాయి. దీనివల్ల ఆర్థరైటిస్ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. వీటిలో ఉండే ఫ్లేవనాయిడ్స్, క్యాన్సర్ కణాలు పెరగకుండా చూస్తాయి. దీంతో బ్రెస్ట్ క్యాన్సర్ ,పెద్ద ప్రేగు క్యాన్సర్, జీర్ణాశయ క్యాన్సర్ రాకుండా అడ్డుకుంటాయి. ఈ పండ్లలో విటమిన్ బి6 సమద్ధిగా ఉంటుంది. ఇది మూడును మారుస్తుంది. డిప్రెషన్ ఆందోళన ఒత్తిడి నుంచి బయటపడేలా చేస్తుంది. మూడు బాగా లేనప్పుడు ఒక సీతాఫలం తింటే చాలు వెంటనే ఉత్సాహంగా మారిపోతారు.చురుగ్గా పనిచేస్తారు.

పండ్ల వ్యాపారం మా జీవనాధారం

మన్సూర్-చల్లా వారి వీధి

ఏ సీజన్లో ఆ సీజన్ పండ్లను తెచ్చి బండ్లపై పెట్టుకుని అమ్ముకుంటూ జీవనం గడుపుతున్నాం. ప్రతిరోజు పాతబస్తీలోని ఫ్రూట్ మార్కెట్ మండి బజార్ హోల్‌సేల్ వ్యాపారి నుండి తెచ్చుకుంటాను. ఈ పండ్లు మహారాష్ట్ర బీజాపూర్, తెలంగాణల నుండి తెస్తారు. 20 కేజీల బాక్స్ రూ.600 నుండి రూ.1000 వరకు సైజును బట్టి ధరలు ఉంటాయి. నాటు సీతాఫలాలు బాక్స్ రూ.500, రూ.600 ఉంటాయి. పచ్చివి, మాగినవి రెండు రకాలుగా ఉంటాయి. వాటిని తెచ్చుకొని అమ్ముకుంటాను. కుటుంబం సాఫీగా గడిచిపోతుంది.

రోజు 600 కూలీ ఇస్తారు-అబ్దుల్ మాలిక్

వీకర్ సెక్షన్ కాలనీ బిల్డింగులు

జిలాని యజమాని బండితో సహా పండ్లను ఇస్తారు. కరెంట్ ఆఫీసు ఎదురుగా పుట్‌పాత్‌పై బండి పెట్టుకొని యజమాని నిర్ణయించిన రేటు ప్రకారం అమ్మాలి. సాయంత్రం వరకు వ్యాపారం చేసి అమ్మినందుకు యజమాని రోజు కూలి కింద రూ.600 ఇస్తారు. నేను ఎలక్ట్రికల్ పని కూడా చేస్తాను. ఆ పని లేనప్పుడు ఇలాంటి వ్యాపారాలు చేస్తుంటాను.

మొదలైన వలసలు

-పొట్టనిండదు..పోకతప్పదు- నేమకల్లు నుంచి తెలంగాణకు 20 కుటుంబాలు

ప్రజాశక్తి - చిప్పగిరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాలలో వలసలు వెళ్లకుండా చేస్తున్న పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడంతో చేసుకోవడానికి పనులు లేక రోజురోజుకు వలసలు పెరుగుతూనే ఉన్నాయి. శని, ఆదివారం రాత్రి పూట మండలంలోని నేమకల్లు గ్రామానికి చెందిన ఎస్‌సి కాలనీలోని దాదాపు 20 కుటుంబాలకు పైగా నాలుగు బొలెరో వాహనాలలో తెలంగాణ జిల్లాలకు పత్తి విడిపించేందుకు వలస వెళ్లారు. గత నెల నుంచి అధిక వర్షాలు రావడంతో ఎక్కడా పనులు లేవు. పొలాలలో చేసుకోవడానికి పనులు దొరకక పొట్టనింపుకోవడానికి వెళుతున్నామని వలస కూలీలు తెలిపారు. వర్షాల వల్ల ఉపాధి హామీ పనులు కూడా ఆగి పోవడంతో రోజు ఇంటి దగ్గరనే ఉండాలంటే పూట గడవదని, ఇంటి సంసార ఖర్చులకు కూడా అప్పులు చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని పలువురు వలస వెళుతున్న కూలీలు తెలిపారు. చిన్నకారు రైతులు వేసుకున్న పంటలకు కూడా అధిక వర్షాలకు దెబ్బతిన్నాయి... చేసిన అప్పులను ఎలా కట్టుకోవాలో అనే మనోవేదనతో తప్పని పరిస్థితులలో గృహాలకు తాళం వేసి వెళుతున్నామని చిన్న కారు రైతులు పేర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలలో మొక్కజొన్న, మిరప, పత్తి పంటలు బాగా ఉన్నాయని, అక్కడ కూలి పనులు చేసుకోవడానికి వెళుతున్నట్లు కూలీలు తెలిపారు. సరయిన జీవనం కొనసాగించడానికి వెళ్లక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీలు వలస వెళ్లకుండా ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. ప్రతి ఏడాది అతివృష్టి లేకుంటే

పిల్లా పాపలతో వసల వెళుతున్న నేమకల్లు ఎస్‌సిలు

అనావృష్టితో వేసిన పంటలు దెబ్బతిని చేసిన అప్పులకు వడ్డీ పెరిగి ఎక్కువై కట్టలేకపోతున్నామని, పంటలు బాగా పండితే అప్పులు తీర్చుకుందాం అని అనుకున్నా కానీ నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఈ దుర్భర పరిస్థితి తమకు ఎప్పుడు పోతుందోనని వ్యవసాయ కూలీలు వాపోతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా రైతులు జీవితాలు మారడం లేదు. రాబోయే రోజులలో గ్రామాలలో మరిన్ని వలసలు పెరిగే అవకాశం ఉందని గ్రామాలలో ఉన్న ప్రజలే చర్చించుకుంటున్నారు. ఈ వలసలను ఆపేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

'ఉపాధి' పనులను కల్పించి వలసలను నివారించాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-ఆస్పరి

గ్రామీణ ఉపాధి హామీ పనులను కల్పించి వలసలను నివారించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని ముత్తుకూరు గ్రామంలో వీరశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని గత కొన్ని సంవత్సరాలుగా బడ్జెట్లో నిధులు తగ్గిస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధి పనులు చేసిన కుటుంబాలకు సకాలంలో కూలీ డబ్బులు చెల్లించకుండా నెలల తరబడి పెండింగులో పెట్టడం వల్ల ఉపాధి పనులకు



సమావేశంలో మాట్లాడుతున్న కెవి.నారాయణ

వెళ్లాలన ఉత్సాహం కూలీలలో తగ్గిందన్నారు. చేసిన పనులకు సకాలంలో డబ్బులు చెల్లించి, 100 రోజుల నుండి 200 రోజులకు పని దినాలు కల్పించి, రోజుకు కూలీ 500లకు పెంచాలన్నారు. ఉపాధి హామీలు పనులలో జరుగుతున్నా అవినీతి, అక్రమాలను అరికట్టి ఉపాధి కూలీలు వలసలు వెళ్లకుండా పనులు కల్పించి వలసలను అరికట్టాలని అధికారులను కోరారు. ఈ నెల 6న ఉపాధి కూలీలతో కలిసి గ్రామాలలోని సచివాలయాల ముందు చేపట్టే ధర్నాలో రైతులు, ఉపాధి కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు లింగన్న, తిక్కన్న, రామాంజనేయులు, బాలకష్ణ, నాగన్న,జిల్లా కమిటీ సభ్యులు రంగరాజు, నరసింహులు, నాగరాజు, దేవేంద్ర, గోపాల్ పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ వీరంగం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని పట్టణ ఇరిగేషన్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వీరంగం సృష్టించారు. మండలం పరిధిలో పెద్దహరివనం గ్రామంలో ఏకంగా పంచాయతీ గేట్ తాళాలు పగలగొట్టేందుకు ప్రయత్నించారు. పెద్దహరివణం గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... నీటి సంఘాల ఎన్నికల సందర్భంగా నోటీసులు స్థానిక పంచాయతీ బోర్డు కార్యాలయం అతికించాలని వాటర్ డిస్ట్రిబ్యూషన్ ఎలక్షన్ అధికారి మధ్యాహ్నం మూడు గంటలకు చెప్పితే రాత్రి 7 గంటలకు వచ్చి స్థానిక పంచాయతీ కార్యాలయాలు తాళాలు వేయడంతో తాగిన మైకంలో పంచాయతీ తాళాలు పగలగొట్టేందుకు ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న గ్రామస్తులు ఏమిటని ప్రశ్నించారు. కార్యాలయం నుంచి నేను సీనియర్ అసిస్టెంట్‌ను నోటీసులు అతికించాల్సి ఉందని చెప్పారు. కొద్దిసేపు ఉండు తాళాలు తెప్పిస్తానని గ్రామస్తులు చెప్పినప్పటికీ పంచాయతీ సిబ్బందిపై గ్రామస్తులపై ఒక రేంజ్‌లో విరుచుకుపడ్డారు. ఒక రాయి తీసుకొని తాళాలు పగలగొట్టేందుకు మరోసారి ప్రయత్నం చేయగా గ్రామస్తులు గట్టిగా నిలదీశారు. అక్కడున్న గ్రామస్తులపై అధికారులకు చెప్పడంతో పై అధికారి మందలించడంతో ఆ తాగిన మైకంలో నోటీసులు అంటించి మెల్లంగా జారుకున్నారు. వాటర్ డిస్ట్రిబ్యూషన్ ఎలక్షన్ అధికారి రాజశేఖర్ ఎఇని వివరణ కోరగా సాగునీటి సంఘాల ఎన్నికల సందర్భంగా 41ఎ నోటీసులు పంచాయతీ కార్యాలయానికి అంటించాలని చెప్పింది. వాస్తవమే అయితే రాత్రి సమయంలో ఏడు గంటలకు తాగిన మైకంలో వెళ్లడం మాకు తెలియదు. గ్రామస్తులు చెప్పడంతో ఫోనులో మందలించాం. వెంటనే తిరిగి రమ్మని చెప్పాం.

పంచాయతీ కార్యాలయంలో గుమిగూడిన గ్రామస్తులు

ఎక్కడివక్కడే..!

- ముందుకు సాగని అభివృద్ధి పనులు - సమస్యలపై స్పష్టత ఇవ్వని ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ అభివద్ధి ఎక్కడ అంటూ సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. తన మార్కు ఏమన్నది ఎమ్మెల్యే ఇంతవరకు చూపకపోవడంతో నమ్మకం సన్నగిల్లుతుంది. పార్టీపై ఉన్న శ్రద్ధ ఆదోనిలో సమస్యల పట్ల చూపడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన ఆదోని ఒకప్పుడు వ్యాపార కేంద్రం. రైలు మార్గం ఉండడంతో నూలు మిల్లులు, పత్తి ఫ్యాక్టరీలు నెలకొల్పి ఎంతోమంది కార్మికులకు ఉపాధికి కొలవై ఉంది. అలాంటి ఆదోని ప్రస్తుతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. పరిస్థితులకు అనుగుణంగా కొఠారి, ఎంఎం, రాయ నూలు మిల్లులు మూతపడడంతో కార్మికులకు ఉపాధి కరువైంది. పత్తిపరిశ్రమలు ఉన్నప్పటికీ మెయింటినెన్స్ భారమై మూత పడుతున్నాయి. సుమారు ఆదోనిలో 50 వరకు పత్తి పరిశ్రమలు ఉన్నాయి వాటిలో కొన్ని సీజన్ లో మాత్రమే పనులు ప్రారంభించి మిగతా సమయాలలో మూతేస్తున్న పరిస్థితి. ఆదోనికి జల వనరులు కేవలం బసాపురం, నాగనాతనహళ్లి చిన్న హరివాణం బలదురు, చిన్న గోనెహాలు ఎడవల్లి, పెద్ద హరివానం, మధిర, హనవాలు, పెద్ద తుంబలం గ్రామాలకు మాత్రమే తుంగభద్ర దిగువ కాలువ ప్రవహిస్తుంది. మిగతా ప్రాంతాలకు వ్యవసాయానికి జల వనరులు లేకపోవడంతో బోరు బోరుబావులపైనే వ్యవసాయం సాగుతుంది. వర్షం పైన వ్యవసాయం సాగుతుండడం వల్ల ఎండాకాలంలో పనులు లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లడం జరుగుతుంది. అప్పుడు మాత్రమే స్పందిస్తున్న అధికారులు కనీసం ఈ ప్రాంతానికి ఏమి చేయాలో సరైన ప్రణాళిక లేకపోవడం ఈ పరిస్థితికి కారణమంటూ పలువురు పేర్కొంటున్నారు.

డెవలప్‌మెంట్ అథారిటీ ఉన్న లేనట్లే

ఆదోని ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ఏర్పడి సంవత్సరాలు గడిచినా ఒక్క పైసా కూడా ప్రత్యేక నిధులు రాకపోవడం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఐఎఎస్ అధికారి ఉన్నా ప్రత్యేకంగా ఎలాంటి నిధులు రాబట్టడం లేదు. పెండింగ్ ప్రాజెక్ట్ అయిన వేదవతిపై ఎలాంటి స్పష్టత లేదు. తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మించాలని డిమాండ్ ఉన్నా ఆ సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావన లేదు.

నిలిచిపోయిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు

మున్సిపాలిటీలో సమన్వయ లోపం

ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 42 వార్డులు ఉన్నాయి. మున్సిపాలిటీలో అధికారులు, కౌన్సిలర్ల మధ్య సమన్వయం లోపం వల్ల అభివృద్ధి కుంటుపడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆదోని మున్సిపాలిటీలో రాజకీయ పరిస్థితులు భిన్నంగా మారాయి. వైసిపికి చెందిన చైర్‌పర్సన్ శాంత వర్సెస్ కౌన్సిలర్లు అన్న రీతిలో వ్యవహారం నెలకొంది. ఎమ్మెల్యే పార్థసారథికి మున్సిపల్ చైర్‌పర్సన్ అనుకూలంగా ఉన్నారని వైసిపి మెజార్టీ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు కోసం ప్రతి నెల నిర్వహించే కౌన్సిల్ సమావేశం ప్రతిసారి రసభసగా సాగుతుంది. కనీసం అభివృద్ధిపై ఎలాంటి చర్చ జరగకుండానే వ్యక్తిగత దూషణలకు దిగుతూ కౌన్సిల్ ప్రతిష్టలు దిగజారుస్తున్నారని పురవాసులు వాపోతున్నారు. పట్టణంలోని పాత బస్టాండు మైదానంలో రూ.33 కోట్లతో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం మొదలుపెట్టినా అర్థాంతరంగా ఆగిపోయింది. లబ్ధిదారులు సుమారు రూ.నాలుగు కోట్లు వాటాను చెల్లించినా పనులు నిలిచిపోవడంతో ఆందోళన గురవుతున్నారు. దీనిపైన ఎమ్మెల్యే స్పష్టత ఇవ్వడం లేదు. చక్కదిద్దాల్సిన ఎమ్మెల్యే పార్థసారథి చోద్యం చూడటం వల్ల శివారు ప్రాంతాలలో రోడ్లు డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్నామని ఆయా ప్రాంతాల వాసులు వాపోతున్నారు.

రోడ్లు లేక ఇబ్బందులు : ఆదోని పట్టణ శివారులోని క్రాంతి నగర్ ఎక్స్‌టెన్షన్, రాజాసాబ్ నగర్‌లో రోడ్లు లేక చిన్నపాటి వర్షం వచ్చినా కాలనీ బురదమయంగా మారుతోంది. రోడ్లు వేయించాలని పలుమార్లు కోరుతున్నా పట్టించుకునే వారే లేరని ఆ కాలనీవాసులు చెబుతున్నారు. కాలనీ ఏర్పడి 20 ఏళ్ళు గడిచినా రోడ్లు, డ్రైనేజీ లేక మురుగు నీరు నిల్వతో, దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు కాలనీ వైపు దృష్టిసారించి రోడ్లు, డ్రైనేజీ వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు ప్రణాలిక

కృష్ణ మున్సిపల్ కమిషనర్ ఆదోని

ఆదోని పట్టణంలో మురికివాడలో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేశాం. పెండింగ్ పనులకు సంబంధించి బిల్లుల చెల్లించాల్సి ఉంది. రికార్డులను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపాం. రోడ్లు డ్రెయినేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. సమస్యలు ఎప్పటికప్పుడు కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారదిశాగా కృషిచేస్తాం.

5న చలో కలెక్టరేట్ విజయవంతం చేయండి

పోస్టర్‌ను విడుదల చేసిన ఎస్‌ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి 5న జరిగే చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం యుటిఎఫ్ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ నూతన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా విద్యార్థుల సమస్యలు పట్టించుకోవట్లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్ల విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని, డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని రదు చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించి, మెస్ ఛార్జీలు రూ.3వేలకు పెంచాలన్నారు. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, జిఒ నెం.77 రద్దు చేసి పీజీ చదివే విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ వర్తింప జేయాలని, తల్లికి వందనం, పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ అమలుపై స్పష్టత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి గౌస్, నాయకులు శశిధర్, నాగరాజు, సంతోష్, గణేష్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

ప్రగతి పథంలో రాష్ట్రం : ఎమ్మెల్యే కోట్ల

- టిడిపి నేత మల్కాపురం నాగిరెడ్డి ని పరామర్శించిన కోట్ల

ప్రజాశక్తి- ఎమ్మిగనూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలో హెచ్‌బిఎస్ కాలనీలో నివాసం ఉంటున్న టిడిపి సీనియర్ నాయకులు, సింగిల్ విండో మాజీ చైర్మన్ మల్కాపురం నాగిరెడ్డిని పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గం టిడిపి నాయకులు, కోట్ల వర్గీయులు జయ సూర్య ప్రకాష్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికి అభిమానం చాటుకున్నారు. కోట్ల మాట్లాడుతూ... చంద్రబాబు అభివృద్ధి సంక్షేమాన్ని రెండు కళ్ళుగా భావించి అభివృద్ధి వైపు పరిగెడుతున్నారని తెలిపారు. సామాజిక పింఛన్లను పెంచి పింఛన్ల పండుగ తీసుకురావడమే కాకుండా సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇచ్చే పథకాన్ని మహిళలకు దీపావళి కానుకగా అందించారని గుర్తు చేశారు. వచ్చే ఏడాది జనవరి 15 నాటికి గుంతలు లేని రోడ్లగా చేసేందుకు నిన్నటి దినాన గుంతలు లేని ఎపి మిషన్ కు సీఎం శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు.టిడిపి నాయకులు ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, ముగతి వీరారెడ్డి, కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కురువ సాధికారిక కమిటీ సభ్యులు, అడ్వకేట్ కెటి మల్లికార్జున, ఎమ్మిగనూరు మాజీ ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులు, టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు మదిరే పీర్ బాష, కెఎండి అబ్దుల్ జబ్బార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో రైతుమృతి

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు మండలం అరికెర గ్రామంలో పంట పొలంలో ఆదివారం విద్యుద్ఘాతంతో రైతు కురువ దూలప్ప (49) మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు పొలంలో బోరు మోటారుకు విద్యుత్ సరఫరా కోసం పొలంలో కేబుల్ కనెక్షన్ ఇస్తుండగా రైతు దూలప్ప విద్యుత్ షాక్‌తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య చిట్టెమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు. ప్రభుత్వం రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

రైతు కురువ దూలప్ప

ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ ఒత్తిళ్లు తగదు

-ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-మంత్రాలయం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ ఒత్తిళ్లు తగ్గించాలని ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎండి.అంజి బాబు, అధ్యక్షులు రాజా నాయక్, ప్రధాన కార్యదర్శి వీరేష్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రాఘసుధ కమ్యూనిటీ హాలులో జిల్లా జనరల్ బాడీసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు చేస్తూ గ్రామాల్లో నైపుణ్యం లేని కూలీలకు ఉపాధి చూపించడంతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తున్న వారిని ప్రభుత్వాలు మారిన ప్రతీ సారి రాజకీయ జోక్యంతో ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. కేవలం రూ.5745 గౌరవ వేతనంతో పని చేస్తున్న మమ్మల్ని గ్రామ పంచాయతీ స్థాయిలో రాజకీయ నాయకుల వత్తిడి వల్ల తొలగించారన్నారు. జిల్లా స్థాయిలో కూడా తొలగింపునకు కుట్రలు జరుగుతున్నట్లు తెలుస్తోందన్నారు. అక్రమ తొలగింపులు, బెదిరింపుల కారణంగా ఇప్పటికే రాష్ట్రంలో నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. దాని కారణంగా వారి కుటుంబాలు వీధిన పడ్డాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉద్యోగాల తొలగింపు రాజకీయ వేధింపులు కక్ష సాధింపు చర్యలు ఉండవని బహిరంగంగా ప్రకటించినా ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమ తొలగింపులు బెదిరింపులు ఉండడం విచారకరమన్నారు. మృతి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిల్లా వ్యాప్తంగా తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. బెదిరింపులకు స్వస్తి చెప్పి ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్. అనుభవం ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లకు అర్హతను బట్టి పదోన్నతులు కల్పించాలని కోరారు. మ్యాండేస్ టార్గెట్ విధానం రద్దు చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ పని దినాల టార్గెట్‌లో పక్కన ఉన్న పంచాయతీ నుంచి ఉపాధి వేతన దారుల ద్వారా పనులు పూర్తి చేయించి టార్గెట్‌ను గ్రామ పంచాయతీ కలిసెలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వీరేష్ మహిళా కార్యవర్గ సభ్యులు ఈరమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు బాలు విశ్వనాథ్, బొజ్జప్ప ,నారాయణ రెడ్డి, మహబూబ్, అర్జున్, రామాంజి, అయ్యప్ప, శేఖర్ తో పాటు మండలాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎండి అంజబాబు, హాజరయిన ఫీల్డు అసిస్టెంట్లు

ఆశాజనకంగా కంది పంట

- సస్యరక్షణతో అధిక దిగుబడులు- ఎడిఎ మహమ్మద్ ఖాద్రి

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఈ ఖరీఫ్ సీజన్లో గోనెగండ్ల మండలంలో రైతులు సాగు చేసిన కంది పంట ఆశాజనకంగా ఉండడంతో రైతన్నల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. కంది పంటకు అవసరమైన స్థాయిలో ఇప్పటి వరకు వర్షాలు కురవడంతో పంట ఆరోగ్యకరంగా ఏపుగా పెరిగింది. ఈ దశలో సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చునిఎ మ్మిగనూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్ మహమ్మద్ ఖాద్రి అంటున్నారు.డివిజన్లోనే అత్యధికంగా ఖరీఫ్‌లో గోనెగండ్ల మండలంలో 2,732 ఎకరాలలో కంది పంట సాగు చేశారు.ఎమ్మిగనూరు మండలం 792, నందవరం మండలం 246, మంత్రాలయం మండలంలో 229 ఎకరాలు సాగు చేశారు. సాగు చేసిన కంది ప్రస్తుతం మొగ్గ పూత కాయ దశలలో ఉంది.ఇటీవల గోనెగండ్ల మండలంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి కంది పంటను పరిశీలించి కందిని ఆశించే కొన్ని పురుగులను గుర్తించినట్లు వారు తెలిపారు. వాటి నివారణకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలను గురించి పలు సలహాలు సూచనలు రైతులకు చేశారు.

మారుకా మచ్చల పురుగు : ఈ పురుగు రెక్కల పురుగు గుడ్ల నుండి పొదిగిన లార్వాలు ఆకులు,పూత మరియు కాయలను చుట్టలుగా చేసుకొని లోపల నుండి వాటిని తిని నష్టం చేస్తాయి. ఈ పురుగు నివారణకు ఏమమేక్టిన్ బెంజోఎట్ 0.3 గ్రాములు లేదా నోవాలురాన్ 1 మిల్లీ లీటర్ లేదా అంప్లిగో మిల్లీ లీటర్ ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.

కాయ ఈగ : ఈ పురుగు కనబడకుండా చాలా నష్టం కలుగజేస్తుంది. ఈ ఈగ తన గుడ్లను కాయ చర్మం తొలిచి అక్కడ పెడుతుంది. వాటి నుండి పొదిగిన పిల్ల పురుగులు లోపల నుండి కాయలను తినివేసి తీవ్రమైన నష్టం కలుగజేస్తాయి. ఈ పురుగు నివారణకు ముందస్తుగా అసిఫేట్ 1.5 గ్రాములు లేదా థయాక్లోప్రిడ్ 0.7 గ్రాములు ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.

శనగ పచ్చ పురుగు : ఈ పురుగు లార్వాలు కాయలపై రంధ్రం చేసుకొని లోపలికి వెళ్లి కాయలోని గింజలను తిని నష్టం కలుగ జేస్తాయి. ఈ పురుగు నివారణకు ఏమమేక్టిన్ బెంజోఎట్ 0.3 గ్రాములు లేదా స్పినోసాడ్ 0.3 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటిలో మరియు 2 శాతం బెల్లం ద్రావణం కలుపుకొని సాయంత్రం వేళల్లో పిచికారీ చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.ప్రస్తుతం కంది పంట బాగా ఏపుగా పెరిగినందువల్ల మామూలు పద్ధతుల్లో పిచికారీ కొద్దిగా కష్టంగా ఉండటం వలన డ్రోన్ ద్వారా పిచికారీ చేసుకుంటే మందు ద్రావణంతో మొక్క పైభాగం బాగా తడపవచ్చు మరియు ఫలితం కూడా బాగా ఉంటుంది.

కంది పంటలను పరిశీలిస్తున్న ఎడిఎ మహమ్మద్ ఖాద్రి

-ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడిన నేతలను సన్మానిస్తున్న నూతన కమిటీ

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా యుటిఎఫ్ ముందుకు వెళుతుందని ఆ సంఘం జిల్లా సహాధ్యక్షులు జీవిత, కార్యదర్శి గాదిలింగప్ప, ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆదోనిలో కౌతాళం మండలం స్వర్ణోత్సవ మహాసభ నిర్వహించారు. వారు మాట్లాడారు. అన్ని కేడర్ల ఉపాధ్యాయులు సమస్యలపై పోరాడుతూ సమస్యల పరిష్కారం కోసం నిత్యం కృషి చేస్తూనే ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు నేడు అనుభవిస్తున్న అన్ని సౌకర్యాలు సంఘం నాయకుల కృషి ఫలితంగానే వచ్చాయన్నారు. చాలామంది యుటిఎఫ్ నాయకులు సంఘం అబివృద్ధి కొరకు అనేక త్యాగాలు చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు ఉద్యోగ ఉపాధ్యాయులకు అనేక ఆర్థిక బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఆరు నెలలకు ఒకసారి చెల్లించవలసిన డిఏలు కూడా సకాలంలో చెల్లించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాల విలీన ప్రక్రియను వెంటనే రద్దుచేసి ప్రాథమికపాఠశాలను పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులకు అదనపు పని భారాన్ని కలిగించే అనవసరమైన యాప్‌లను తగ్గించి ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించరాదన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని, ఉన్నత పాఠశాలలో నాన్‌టీచింగ్ స్టాఫ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

కౌతాళం మండల కమిటీ ఎన్నిక

కౌతాళం మండలం గౌరవ అధ్యక్షులుగా బసప్ప, అధ్యక్షులుగా నల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఓంకార్, ఆర్థిక కార్యదర్శిగా బసవరాజు, సహ అధ్యక్షులుగా రంగన్న విజయలక్ష్మి జిల్లా కౌన్సిల్ సభ్యులుగా శ్రీనివాసులు, సుధాకర్, రంగన్న, సంధ్య జ్యోతి, వీరశ్రీ, రాజీవ్ గాంధీలను ఎన్నుకున్నారు. వీరితోపాటు మండల మహిళా కన్వీనర్, అకాడమీ కన్వీనర్, ఆడిట్ కమిటీ కన్వీనర్, సాంస్కృతిక విభాగం కన్వీనర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు యుటిఎఫ్‌కు సేవలందించిన సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, వాణి కుమారి, విరుపాక్షి, మహేష్‌లను శాలువా పూలమాలతో సన్మానించారు.

నల్లారెడ్డి, ఓంకార్

రాజగోపురం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి- కౌతాళం

శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థాన రాజగోపుర నిర్మాణానికి బెంగళూరు వాస్తవ్యులైన ఇల్లూరు విజయకుమార్ , కుటుంబ సభ్యులు రు.70,000 ఆన్‌లైన్‌లో విరాళంగా చెల్లించారని సూపరిన్‌టెండెంట్ మల్లికార్జున తెలిపారు. శనివారం అయిన మాట్లాడుతూ దాతలకు శ్రీ స్వామి దర్శనం, స్వామివారి శేష వస్త్రం లడ్డూ ప్రసాదాలు, ఆశీర్వాదాలు కల్పించి, బాండు పేపర్, పూలమాలతో సత్కరించారు. ఉప ప్రధాన అర్చకులు పూజన్న స్వామి , దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.